క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

మునగాల : మునగాల ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11గంటలకు ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు తమ మూడు నెలలో నివేదికతో హాజరు కావాలని కోరారు.

రేపాలలో నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

మునగాల : మండలంలోని రేపాలలో శ్రీస్వయంభు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి ఈనెల 28వరకు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.పదివేలు, ద్వితీయ రూ.ఏడువేలు, తృతీయ రూ.నాలుగు వేలు, చతుర్ధ బహుమతి రూ.మూడు వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 95425 67959, 99599 09927 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడుచర్ల : మండలంలోని ముకుందాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లేన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఎన్నికల విధుల్లో భాగంగా చింతలపాలెం, దొండపాడు గ్రామాల్లో గురువారం స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అదే విధంగా వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అటవీ భూమి, నదిలో ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెం మండలంలోని మల్లారెడ్డిగూడెం, నెమలిపురం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తారని హెచ్చరించారు. అటవీ, మైనింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

షిరిడీకి పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న ప్రముఖులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి మహారాష్ట్రలోని శిరిడి సాయి దేవాలయం వరకు పలువురు భక్తులు గురువారం పాదయాత్ర చేపట్టారు. పట్టణ ప్రముఖులు పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

మునగాల: మండల కేంద్రంలో కొందరు రియల్ ఎస్టేటు వ్యాపారులు, బ్రోకర్లు అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసి కొనుగోలుదారులకు చేసిన అక్రమ ప్లాట్ల రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేయాలని మండలానికి చెందిన సామాజిక కార్యకర్త రాయల కృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీ లేఅవుట్, నాలా పర్మిషన్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. రియల్ ఎస్టేటు వ్యాపారులకు సహకరించిన రెవెన్యూ సిబ్బందిని కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధులను అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా రెండు నెలలుగా విష జ్వరాలు, కీళ్ల నొప్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. తక్షణమే వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విష జ్వరాలను అరికట్టాలని ఆయన కోరారు. పార్టీ మండల కమిటీ సభ్యులు చందాల భిక్షం, చీగడ రాములు, సిద్దెల వెంకటయ్య, కాల్వ వెంకటేశ్వర్లు, మాధవరావు, కోటేశ్వరరావు, వెంకటనారాయణ, సైదులు, రాములు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- బ్రిడ్జిలపై నిత్యం ప్రమాదాలు
- ఎప్పుడు కూలుతాయోనని భయాందోళన చెందుతున్న ప్రజలు



శిథిలావస్థలో రత్నవరం, త్రిపురవరం గ్రామాల మధ్య వంతెన

నడిగూడెం : మండలంలోని పలు గ్రామాల్లో మేజర్ కాల్వలపై 40 ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు కూలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రత్నవరం, త్రిపురవరం గ్రామాల మధ్య ఉన్న కొత్తగూడెం మేజర్ కాల్వపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్ కూడా దెబ్బతిన్నది. అలాగే కొమరబండ మేజర్ కాల్వపై ఎక్లాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెనలు ఇరుకుగా ఉండి, రెయిలింగ్ దెబ్బతిన్నాయి. ఈ గ్రామాల మీదుగా చాకిరాల, రామాపురం, ఎక్లాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి గ్రామాల ప్రజలు నిత్యం వందల మంది కోదాడకు వెళ్తుంటారు. శ్రీరంగాపురం, వల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పాలారం మేజర్ కాల్వపై ఉన్న వంతెన కూడా ప్రమాదకరంగా మారింది. రెండు వైపులో కాల్వ కట్ట బలహీనంగా మారింది. అయితే కోట్ల రూపాయల వ్యయంతో కాల్వలకు ఆధునీకరణ పనులు చేపట్టిన ప్రభుత్వం వంతెనలకు మాత్రం మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఈ వంతెనల వద్దకు రాగానే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్ఎస్పీ అధికారులు స్పందించి కొత్త వంతెనలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



వల్లాపురం నుంచి శ్రీరంగాపురం వెళ్లే రహదారిలో పాలారం మేజర్ కాల్వపై వంతెన ప్రమాదకరంగా మారింది. రెయిలింగ్ కూడా లేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద వాహనాలు వస్తే చాలా ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– దుస్సా నారాయణ, వల్లాపురం

నూతన బ్రిడ్జి నిర్మించాలి



రత్నవరం, త్రిపురవరం గ్రామాల మధ్య కొత్తగూడెం మేజర్ కాల్వపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై రాత్రి సమయంలో ఆదమరిస్తే అంతే సంగతులు. గతంలో వంతెనపై రత్నవరం గ్రామస్తులే స్వచ్ఛందంగా మట్టిపోయించారు. రెయిలింగ్ కూడా దెబ్బతిన్నది. కూలగొట్టి నూతన బ్రిడ్జి నిర్మించాలి.

– పోలంపల్లి వెంకటేశ్వర్లు, రత్నవరం

సేవ చేయాలన్న సంకల్పం గొప్పది

- ఆర్డీఓ శ్రీనివాసులు



స్ప్రెడ్డింగ్ షెల్ఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : సామాజిక సేవ చేయాలన్న సంకల్పం గొప్పదని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. నిరాశ్రయుల ఆకలి తీర్చేందుకు హుజూర్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్ప్రెడ్డింగ్ షెల్ఫ్స్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంచి ఆలోచనతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం స్ప్రెడ్డింగ్ షెల్ఫ్స్ కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ కేంద్రంలో ఎవరికైనా ఉపయోగపడే వస్తువులను తీసుకెళ్లొచ్చని, ఇళ్లలో ఉపయోగం లేని వస్తువులను అక్కడ పెట్టి వెళ్లవచ్చన్నారు. మిగిలిన భోజనం, పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు, బేకరీ వస్తువులు, చెప్పులు, బట్టలు, వాటర్ బాటిల్స్, దుప్పట్లు ఇతరత్రా ఏవైనా ఇవ్వవచ్చని, అవసరమైతే తీసుకెళ్లవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగర్జున రెడ్డి, ఎస్ఐ బలరాంరెడ్డి, నిర్వాహకులు ముభీద్ అయాన్, చొప్పరి యర్రయ్య, అయూబ్, షారుక్ ఖాన్, ఇమ్రాన్, సమీర్, జలేందర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సామాజిక వర్గానికి రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలి

మునగాల : పార్లమెంట్ ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గానికి రెండు పార్లమెంట్ సీట్లు కేటాయించాలని మండలానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు, కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు డా.వేమూరి సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కమ్మ సామాజిక వర్గం, తెలంగాణ రాష్ట్ర కమ్మ రాజకీయ ఐక్యవేదిక, కమ్మ సంఘం నాయకులు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. కావున ఖమ్మం, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాలలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు



మఠంపల్లిలో మాట్లాడుతున్న డీటీసీపీఓ

మఠంపల్లి : గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టొదని, వెంచర్లు ఏర్పాటు చేయొద్దని డీటీసీపీఓ రాహుల్, ఎంపీఓ అంజనేయులు అన్నారు. గురువారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేని ఇళ్ల నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో వెంచర్లు ఏర్పాటు చేస్తే ఆయా వెంచర్లలో గ్రామ పంచాయతీలకు 10 శాతం భూమి రిజిస్ట్రేషన్, 15 శాతం మార్టిగేజ్‌ను తప్పనిసరిగా చేయాలని చెప్పారు. వెంచర్లలో జీ ప్లస్ టూ నిర్మాణం వరకే పంచాయతీలు అనుమతిలివ్వాలని అంతకంటే ఎక్కువగా నిర్మిస్తే మాత్రం డీటీసీపీకి అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏపీఓ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, నరసింహారావు, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చంటి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని ఎల్బీనగర్ గ్రామంలో శ్రీకోదండరామస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్లకు పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామివారి చిత్రపటంతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి రెంటాల సతీష్ వర్మ, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు భక్తులు పాల్గొన్నారు.

కోదాడ ఎంవీఐ జిలానీకి సన్మానం



ఎంవీఐ జిలానీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లారీ అసోసియేషన్ నాయకులు

కోదాడఅర్బన్ : కోదాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిలానీని కోదాడ లారీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గురువారం కోదాడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసి అందరి మన్ననలు పొందిన జిలానీ తిరిగి కోదాడకు రావడం సంతోషంగా ఉందని లారీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, కోదాడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కనగాల నాగేశ్వరరావు, తూనం కృష్ణలు అన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎంవీఐ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు రఫీ, గుండపనేని నాగేశ్వరరావు, నరసరాజు, అంజయ్య, శ్రీనివాసరావు, లింగయ్య, వీరబాబు, కోటేశ్వరరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు

మునగాల : మండలంలోని కలకోవలో ఏప్రిల్ 17 నుంచి 21 వరకు నిర్వహించబోయే శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి, హనుమాన్, జీవధ్వజ శిఖర గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ద్వారపాలక విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ జూకూరి అంజయ్య కోరారు. గురువారం గ్రామంలో ప్రతిష్ఠాపనోత్సవాల ఆహ్వాన పత్రికను గ్రామపెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిష్ఠ మహోత్సవాలకు దాతలు సహకరించాలని కోరారు. వేద పండితుడు వారణాసి ఉదయభాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి వీరబాబు గౌడ్, ఎంపీటీసీ గన్నా భవాని, గ్రామపెద్దలు గన్నా నరసింహారావు, దొంగరి అప్పారావు, అమరగాని వీరభద్రం, పనస విజయ్, మండవ చినసైదులు, మునగలేటి తిర్పయ్య, పల్లె శ్రీరాములు, పనస పెద్ద శ్రీను, మండవ వీరబాబు, వీరభద్రం, మోహన్‌రావు, మధు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలి



వెలిదండలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గరిడేపల్లి : బోర్లు, కాలువల కింద ఎండిపోయిన పొలాలకు ఎకరానికి రూ. 30వేల నష్టపరిహారం ఇవ్వాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామ పరిధిలో ఎండిపోయిన పంట పొలాలను గురువారం భారత రైతు కూలీ సంఘం నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీరందక వందల ఎకరాల పొలాలు ఎండిపోవడంతో పెట్టుబడులు కూడా వెళ్లక రైతులు లబోదిబోమంటున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, సాంబయ్య, నాగేశ్వరరావు, శ్రీను, బ్రహ్మయ్య, నాగయ్య, సైదులు, రమేష్, లక్ష్మయ్య, ముత్తయ్య, ఎల్లయ్య, భిక్షం, సూర్యం, కామళ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తిరుపతమ్మ తిరునాళ్లు

- ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- ఐదు రోజులపాటు జాతర
- 24న శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం



ఆలయంలో కొలువై ఉన్న శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడులో శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ (జాతర) మహోత్సవాలు ఈనెల 23వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజు శనివారం ఆలయంలో అమ్మవారికి అఖండ దీపారాధన, ప్రత్యేక కుంకుమార్చనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆదివారం పుట్టింటి పసుపు కుంకుమలను అమ్మవారికి సమర్పిస్తారు. అదేరోజు రాత్రి శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని నిర్వహిస్తారు. సోమవారం ఉదయం నాగేంద్రస్వామికి పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం రథోత్సవం, ఊరేగింపు నిర్వహించనున్నారు. మంగళవారం అమ్మవారికి జలాభిషేకం, ప్రత్యేక అలంకరణ, బుధవారం ఉదయం ప్రభోత్సవం, బోనాలు, మొక్కుల సమర్పణ, రాత్రి స్వామి, అమ్మవారికి పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలను వైఖానస ఆగమ ప్రకారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గున్నం రమాదేవి నాగిరెడ్డి తెలిపారు.

రెండు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు

శ్రీతిరుపతమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని ఈనెల 23వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలను నిర్వహించనున్నారు. అంతేకాకుండా సూర్యాపేట, నల్ల గొండ, ఖమ్మం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు, కబడ్డీ, రింగ్‌బాల్, త్రోబాల్ పోటీలను కూడా నిర్వహించనున్నారు. అంతేకాకుండా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిరునాళ్ల మహోత్సవాలను తిలకించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవరం వెంకటరెడ్డి

మునగాల : యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యం కొనేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరికోతలు గత పక్షం రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయని అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతాంగం మధ్య దళారీలు, మిల్లర్లకు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా గ్రామాలలో బ్యానర్లు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరికోతల ప్రారంభ సమయంలో ధాన్యం ధర బస్తాకు రూ.2100 కొనుగోలు చేసిన వ్యాపారులు నేడు రూ.1700లకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, మిల్లర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందేవిధంగా కృషిచేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు దేవరం శ్రీనివాసరెడ్డి, చింతకాయల నాగరాజు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటరావు



మునగాలలో నీటి ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

మునగాల : ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు కోరారు. గురువారం మునగాల మండల కేంద్రంలో పలు నీటి ట్యాంకులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నీటి ఎద్దడి ఎక్కడ ఉందో తక్షణమే గుర్తించాలని, ఎక్కడైనా బోర్లు మరమ్మతుకు గురైతే వెంటనే రిపేరు చేయించాలన్నారు. ఏ గ్రామంలోనైనా నీటిఎద్దడి తీవ్రంగా ఉంటే గుర్తించి తనకు వివరాలు పంపాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. ఆయన తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి ఉన్నారు.

పశువులకు ట్యాగులు తప్పనిసరి

- పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య



నారాయణపురంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని పరిశీలిస్తున్న పెంటయ్య

చిలుకూరు : పశువులకు ట్యాగులు తప్పనిసరిగా ఉండాలని, ట్యాగులు లేకపోతే రైతులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య అన్నారు. చిలుకూరు మండలంలోని నారాయణపురంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులకు ఆధార్ నంబర్ ఎలాగో పశువులకు కూడా ప్రత్యేక గుర్తింపు కార్డు సంఖ్య కలిగిన బార్ కోడ్ ట్యాగులు ఉండాలని సూచించారు. అదేవిధంగా రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధుల నివారణ టీకాల పంపిణీ ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వీరారెడ్డి, సిబ్బంది పరిమళ, వెంకటేశ్వర్లు, నరేష్, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : పశువులకు సోకే వ్యాధుల నివారణకు పశు పోషకులు ముందస్తు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పెంటయ్య అన్నారు. హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న పశువుల గాలికుంటు వ్యాధి నివారణ టీకా శిబిరాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో పశురక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ రూపాకుమార్, వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి అశోక్‌కుమార్

మఠంపల్లి : మఠంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని డైరెక్టర్లు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘంలోని తొమ్మిది మంది డైరెక్టర్లు మఠంపల్లి మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమావేశమై అధ్యక్షుడిగా తవిడబోయిన నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా తుంగం వీరయ్య, కార్యదర్శిగా చింతల వీరబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గంచే ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. అదేవిధంగా కర్నె సైదమ్మ, బుద్ది సక్కుబాయమ్మ, చాగంటి నరసింహారావు, చింతల లక్ష్మీనారాయణ, తవిడబోయిన కృష్ణ, తవిడబోయిన వీరయ్యలు డైరెక్టర్లుగా కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్నె రమణవెంకటేశ్వర్లు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కంటు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సత్కారం



జొన్నలగడ్డ హనుమయ్యను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కోదాడఅర్బన్ : 60 సంవత్సరాల పాటు ఏకధాటిగా వెంకట్రామపురం పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికై, రెండుసార్లు సర్పంచ్‌గా పని చేసి ప్రస్తుతం 90 ఏళ్ల వయస్సులోనూ పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్న జొన్నలగడ్డ హనుమయ్యను కోదాడకు చెందిన బీజేపీ నాయకులు గురువారం కోదాడలోని ఆయన ఇంట్లో కలిసి శాలువాతో సత్కరించారు. సొసైటీ చైర్మన్‌గానే కాకుండా క్రిబ్కో ఆర్జేడిగా కొనసాగుతున్న ఆయన నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని, బీజేపీని ఆశీర్వదించి బలపరచాలని తాము హనుమయ్యకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, కనగాల నారాయణ, వంగవీటి శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక చికిత్సతో కుష్టు వ్యాధిని నయం చేయొచ్చు

హుజూర్‌నగర్ : కుష్టు వ్యాధిని స్వల్పకాలిక చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని డీఎంపీఓ సురేష్ బాబు అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో కుష్టు వ్యాధి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని పూర్తిగా నివారించడానికి వైద్య ఆరోగ్యశాఖ ఈనెల 11 నుంచి 24 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆశా కార్యకర్తలు ప్రతిరోజు 20 ఇళ్లకు వెళ్లి కుష్టు వ్యాధిని గుర్తించి పరీక్షల అనంతరం బహుళ ఔషధ చికిత్స ద్వారా మందులు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిరాల రామకృష్ణ, ఆశా, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు.. పలువురిపై కేసు నమోదు

హుజూర్‌నగర్ : ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడులలో రెండు ద్విచక్ర వాహనాలతో పాటు 27 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని పలువురిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన బాణోత్ బాలా వద్ద 10 లీటర్ల సారాతో పాటు హీరో హోండా బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు. గరిడేపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన ధరవత్ సఖ్య సారా తరలిస్తుండగా 6 లీటర్ల సారాతో పాటు అతడి బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా సుల్తానాపూర్ తండాకి చెందిన అజ్మీరా హుస్సేన్ ఇంటి నుంచి 5 లీటర్ల సారా, 400 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మఠంపల్లిలో సారా విక్రయాలు చేస్తున్న బానోతు జ్యోతి ఇంటి నుంచి 6 లీటర్ల సారా సీజ్ చేసి ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐలు జగన్మోహన్‌రెడ్డి, గోవర్ధన్, ధనుంజయ్, సిబ్బంది నరేష్, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులకు గురువారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మారోజు శ్రీలత తన భర్త శ్రీనివాసాచారి జ్ఞాపకార్థం ప్లేట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు దాసరాజు సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.